ఉపాధి కల్పన వేతనం కల్ల

గ్రామీణ ప్రాంతాల్లో వలసల్ని నియంత్రించాలి. ఉన్న ఊర్లోనే ఏడాదిలో కనీసం వంద రోజుల ఉపాధి కల్పించాలి. ప్రజల జీవనోపాధిలో భద్రతకు కేంద్రం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చింది. అయితే నెలల తరబడి ఉపాధి వేతనాలు రాకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. నర్సీపట్నం మండలంలో 9 వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాల్లేవు. దీంతో ప్రత్యామ్నాయ ఉపాధికి మళ్లీ వలసబాట పట్టాల్సి వస్తోంది.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- 2 నెలలుగా ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- ప్రభుత్వం నుంచి విడుదల కాని ఉపాధి నిధులు
- మండలంలో జాబ్‌కార్డుదారులకు నిలిచిన చెల్లింపులు
- ఇల్లు గడవక ప్రత్యామ్నాయ ఉపాధి వైపు కూలీలు

నర్సీపట్నం: నర్సీపట్నం గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబంలో పని చేసేందుకు ముందుకొచ్చే వారికి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం పని కల్పిస్తోంది. స్థానికంగా ఉంటూ వ్యవసాయ పనుల్లేని సమయంలో ఈ పథకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. అయితే వేతన బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యంతో కూలీలు నానా యాతన పడుతున్నారు. ఒకవైపు పని దినాలు కనీసం 200కు చేర్చాలన్న డిమాండ్ ఉన్న తరుణంలో వేతన చెల్లింపులు సక్రమంగా చేయకపోవడంతో ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న ఊళ్లో పనిచేసుకుంటూ కలోగంజో తాగి బతుకుదామన్నా వీల్లేకుండా పోతోందని వాపోతున్నారు.

బకాయిలు రూ.10 లక్షలపైనే..

ఉపాధి హామీ కూలీలకు రెండు నెలలుగా చెల్లింపులు నిలిచిపోయాయి. వ్యవసాయ పనులకు విరామం రావడంతో కూలీ డబ్బులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సాధారణంగా కూలీల పని వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత వారం రోజుల వ్యవధిలో వారి ఖాతాల్లో నగదు జమ అవుతుంది. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో వేతనాలు అందలేదు. ఫలితంగా కూలీలు పస్తులు ఉంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. నర్సీపట్నం మండలంలో 12 పంచాయతీల్లో 7,851 జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరిలో 3,500 మంది జాబ్ కార్డులదారులు పనులకు వెళ్తున్నారు. రూ.10 లక్షలకు పైనే వేతన బకాయిలు ఉన్నాయి.

కానరాని సదుపాయాలు

ఉపాధి హామీ పథకంలో ట్రెంచులు, సరిహద్దు కందకాలు, ఇంకుడు గుంతలు, పండ్ల తోటల పెంపకం, గడ్డి పెంపకం, ఫారం పాండ్స్, మినీ గోకులాలు, తదితర పనులు జరుగుతున్నాయి. ఎండలు మండిపోతున్నాయని, గునపాలతో పనిచేస్తే చేతులు బొబ్బలెక్కుతున్నాయని కూలీలు వాపోతున్నారు. పని ప్రదేశంలో కనీసం నీరు, నీడ వసతి కరువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలల నుంచి బకాయిలే..



ఫిబ్రవరి నుంచి మార్చి వరకు చేసిన ఉపాధి పనులకు వేతనాలు అందలేదు. పనికి వెళ్లినా సకాలంలో డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నాం. బకాయిలు జమ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మజ్జి లోవ, గురందరపాలెం

నిధులు రావాల్సి ఉంది...



ఉపాధి పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది. కూలీల వివరాలను ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. త్వరలోనే నగదు జమ అవుతుంది. వెంటనే చెల్లింపులు చేపడతాం.

– సత్యవతి, ఏపీవో, నర్సీపట్నం

తక్షణమే 9 వారాల వేతన బకాయిలు చెల్లించాలి

కె.కోటపాడు : ఉపాధి పథకం వేతనదారులకు తక్షణం 9 వారాల బకాయి వేతనాలను చెల్లించాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి వనుము సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సూర్రెడ్డిపాలెంలో ఉపాధి కూలీలతో శుక్రవారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి 2024 వరకూ ఉపాధి హామీ పథకం కోసం బడ్జెట్‌లో రూ.లక్షా 25 వేల కోట్లు కేటాయింపులు చేస్తే ప్రస్తుతం రూ.65 వేల కోట్లను మాత్రమే కేటాయించిందని తెలిపారు. ఈ కేటాయింపుల ద్వారా లబ్ధిదారులకు ఉపాధి పనులకు మొండి చేయి చూపుతున్నట్లు అర్థమవుతోందన్నారు. ఇప్పటికైనా ఉపాధి వేతనదారుల బకాయిల చెల్లింపుల కోసం వెంటనే నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


సూర్రెడ్డిపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకుడు సూర్యనారాయణ

ఎం.అలమండలో శ్రీరాముని పెళ్లిరాట


రాట వేస్తున్న సర్పంచ్ దాడి జగన్

దేవరాపల్లి: ఎం.అలమండ గ్రామంలో సీతారాముల పెళ్లి రాట మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగే శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి జగన్, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు భూమి పూజ

దేవరాపల్లి: మండలంలోని నాగయ్యపేట, కాశీపురం, ఎన్.గజపతినగరం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శుక్రవారం భూమి పూజ చేశారు. చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేటలో సుమారు రూ.84 లక్షలతో నిర్మించే బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.2.05 కోట్లతో బాలికల వసతి గృహం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇదే హైస్కూల్‌లో రూ. 15.58 లక్షలతో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. రూ.5 లక్షలతో నిర్మించిన క్రీడా ప్రాంగణం, రూ.1.50 లక్షలతో నిర్మించిన కిచెన్ గార్డెన్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ సరఫరా చేసిన పాఠ్య, నోట్ పుస్తకాలను ఇంటర్మీడియట్ విద్యార్థులకు అందజేశారు. స్థానిక సర్పంచ్‌లు కర్రి పుష్ప, ఆదిరెడ్డి వరలక్ష్మి, సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు, తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, సమగ్ర శిక్ష ఈఈ డి.వి.నర్సింహారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తూటిపాలలో సమతా దివస్


జగ్జీవన్‌రామ్ వేషధారణలో ఉన్న దావీద్‌తో మిగతా విద్యార్థులు

మాకవరపాలెం: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా మండలంలోని తూటిపాల యూపీ స్కూల్‌లో శుక్రవారం సమతా దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాలలో 6వ తరగతి విద్యార్థి ఎం.దావీద్ జగ్జీవన్ రామ్ వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నాడు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం రాము మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోషి, లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ


గర్భిణులకు తనిఖీలు చేస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : గర్భిణుల్లో రక్తహీనత సమస్య రాకుండా క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ సూచించారు. పిండ్రంగి గ్రామంలో శుక్రవారం ఎఫ్‌పీసీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని, వృద్ధులు, చిన్నారులు బయటకు రావొద్దన్నారు. హెచ్‌బీ పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న విద్యార్థులకు ఐరన్ మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్.వి.భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎం పార్వతి, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, ఆశా కార్యకర్తలు రామలక్ష్మి, యర్రయ్యమ్మ పాల్గొన్నారు.

ఉపాధి సిబ్బందికి బదిలీలు

మాకవరపాలెం: ఐదేళ్ల పాటు పనిచేసిన ఉపాధి హామీ సిబ్బంది బదిలీ అయ్యారు. ఈ మేరకు ఇక్కడ ఏపీవోగా పని చేస్తున్న వరలక్ష్మి రాంబిల్లి బదిలీ కాగా, రావికమతంలో పని చేస్తున్న ఏపీవో కాశీని మాకవరపాలెంలో నియమించారు. ఈసీతో పాటు టెక్నికల్ సిబ్బందిని సైతం బదిలీ చేసి, కొత్తవారిని నియమించినట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి శుక్రవారం తెలిపారు.

యూకలిప్టస్ తోటలు దగ్ధం


దగ్ధమవుతున్న యూకలిప్టస్ తోటలు

రావికమతం: మరుపాకలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో రైతులు గొర్లె సత్తిబాబు, రామరాజు, శ్రీనివాసరావు, కన్నతల్లికి చెందిన 1.80 ఎకరాల్లోని యూకలిప్టస్ తోటలు కాలిపోయాయి. సమాచారం అందుకున్న గర్నికం అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి వెళ్లి నీటి పైపులతో మంటలను అదుపు చేశారు. రూ.50 వేల వరకు పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కుసుర్లపూడి హైస్కూల్‌కు నాలుగు ర్యాక్‌ల వితరణ


దాతలు అందించిన ర్యాక్‌లతో హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు

రోలుగుంట: కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన దివంగత సబ్బవరపు పెద్దినాయుడు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు నాలుగు ఇనుప ర్యాక్‌లను హెచ్‌ఎం శెట్టి మోహన్‌కు శుక్రవారం అందజేశారు. ఈ ర్యాక్‌లను కుటుంబీకులు గేదెల మహాలక్ష్మినాయుడు, వెంకటేష్, సబ్బవరపు శివనారాయణ, కాశి శ్రీను సొంత నిధులతో సమకూర్చారు. దాతలకు హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

మాడుగుల: స్థానిక కొబ్బరితోట వీధిలోని సీతారామ స్వామి ఆలయ ఉత్తర ద్వారం వైపు తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ జవ్వాది వరహాలు, ఆర్యవైశ్య సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే పారిశుధ్యం మెరుగు


తడి, పొడి చెత్త వేరు చేయు విధానంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఈవోపీఆర్డీ రమణి, సరోజిని

కె.కోటపాడు : ప్రజల సంపూర్ణ భాగస్వామ్యంతోనే పల్లెల్లో పారిశుధ్యం మెరుగుపడుతుందని ఈవోపీఆర్డీ రమణి తెలిపారు. వారాడ, డి.అగ్రహారం గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రజలు తడి, పొడి చెత్తను ఏ విధంగా వేరు చేసి పారిశుధ్య సిబ్బంది, క్లాప్ మిత్రలకు అందించాలో తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కూరగాయలు, పండ్ల తొక్కలు, మాంసం, గుడ్ల పెంకులు, పూలు, పాడైన ఆహార పదార్థాలను తడి చెత్తగా గుర్తించాలని, ప్లాస్టిక్, పాల కవర్లు, పేపర్, ఇనుము, అల్యూమినియం, స్టీల్ పాత్రల వ్యర్థాలను పొడి చెత్తగా వేరు చేసి ప్రత్యేక డస్ట్‌బిన్‌ల ద్వారా పారిశుధ్య సిబ్బందికి అందించాలని ఆమె సూచించారు. పంచాయతీ కార్యదర్శి బి.సరోజిని, సర్పంచ్ గొర్రుపోటు సౌజన్య, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం డి.అగ్రహారంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో పేడ ద్వారా సేంద్రియ ఎరువు తయారీని ఈవోఆర్డీ రమణి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు సేంద్రియ ఎరువును తక్కువ ధరకే అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీత, క్లాప్‌మిత్ర రాము పాల్గొన్నారు.

పాఠశాలలో వాటర్ బెల్‌లు వాడాలి

- ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు



నాతవరం: వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టాలని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు అన్నారు. ఆయన శుక్రవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల్లో మంచినీటి బెల్‌లు విధిగా వాడాలన్నారు. పాఠశాల ప్రారంభ సమయం దగ్గర్నుంచి ప్రతి గంటకు విధిగా మంచినీటి బెల్ కొట్టి విద్యార్థులకు తాగునీరు అందించాలన్నారు. విద్యార్థులు వడదెబ్బకు గురైతే ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయంపై మండల వ్యాప్తంగా పాఠశాలల హెచ్‌ఎంలకు సర్క్యులర్ ద్వారా తెలియజేశామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉచిత విద్య

రోలుగుంట: పిల్లల బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వ పాఠశాలల్లో అందించే ఉచిత బోధనే మేలని కొండపాలెం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్ అన్నారు. రెండు రోజులుగా ఆయన గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ విస్తృత ప్రచారం చేపట్టారు. దీనిలో భాగంగా ఆయన ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి గ్రామాల్లో ఇంటింటికి, అలాగే ఉపాధి పనుల చేస్తున్న ప్రదేశాలకు వెళ్లి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు, ప్రైవేటు స్కూళ్లకు మధ్య గల వ్యత్యాసాన్ని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో అందించే బోధన విద్యార్థులకు మేలు చేస్తుందన్నారు. ప్రవేశాలు, బోధన, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూష్, బ్యాగులు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. రోజూ కష్టపడితే వచ్చే ఆదాయాన్ని దాచుకుని, గ్రామాల్లోనే ఉచితంగా అందే విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


కొండపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న హెచ్‌ఎం ఈశ్వరప్రసాద్

మోదమాంబ ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందిస్తున్న దాత జగన్నాథం కుటుంబ సభ్యులు

మాడుగుల రూరల్: పోతనపూడి పంచాయతీ శివారు కొండయ్యపాలెంలో నిర్మాణ దశలో ఉన్న మోదమాంబ ఆలయానికి గ్రామానికి చెందిన జగడాల జగన్నాథం కుటుంబ సభ్యులు రూ.30 వేలు విరాళం అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరుకొండ సత్తిబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ చెల్లంనాయుడుకు విరాళం మొత్తాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అప్పికొండ జగ్గారావు, గుమ్మాల రమణ, బి.స్వామి నాయుడు, పి.నాగరాజు పాల్గొన్నారు.

'ప్రైవేట్ స్కూళ్ల మాయలో పడొద్దు'


వడ్డాదిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం శేషగిరిరావు

బుచ్చెయ్యపేట: ప్రైవేటు పాఠశాలల మాయమాటలకు, ప్రలోభాలకు లొంగిపోకుండా తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉన్నత విద్య అందేలా చూడాలని ఉపాధి కూలీలకు వడ్డాది మెయిన్ స్కూల్ హెచ్‌ఎం టి.వి.శేషగిరిరావు కోరారు. శుక్రవారం గ్రామ శివారులో చెరువు వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను ఆయన కలిశారు. ప్రైవేటు పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో పాటు ప్రభుత్వం అందించే రాయితీలు కోల్పోతారని హెచ్‌ఎం సూచించారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి


మాడుగుల రాములవారి ఆలయం వద్ద పెళ్లిరాట వేస్తున్న భక్తులు

మాడుగుల: స్థానిక గవర వీధిలోని రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం స్వామి కల్యాణోత్సవాలకు పెళ్లిరాట వేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గిరిజనులకు సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

దేవరాపల్లి: సికిల్ సెల్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్య మేఘన అన్నారు. ఈ మేరకు మండలంలోని చింతలపూడి, గరిశింగి పంచాయతీ పరిధిలోని గిరిజన చిన్నారులు, గర్భిణులతో పాటు 30 ఏళ్లు పైబడిన గిరిజన ప్రజలందరికీ సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. అనుమానితులను విశాఖ కేజీహెచ్‌కు పంపించనున్నట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ శిబిరంలో దేవరాపల్లి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, స్థానిక ఏఎన్‌ఎం లక్ష్మీదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


చింతలపూడిలో సికిల్ సెల్ వ్యాధి పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘన

అర్హులకు ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం

నాతవరం: ఎన్నికలు కమిషన్ ఆదేశాల ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ అన్నా రు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పోలింగ్ బూత్ లెవెల్ అధికారులు, రెవెన్యూ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు ప్రకారం కొత్తగా ఓటర్లుగా చేర్పించడమే కాకుండా ఓటర్ల జాబితాలో తప్పు ఒప్పులను సరి చేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం నర్సీపట్నం నియోజకవర్గం ఎన్నికలు డిప్యూటీ తహసీల్దార్ సుధారాణి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మృతుల పేర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు టి.వి.ఎల్.రాజు, భూరీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శివ, పోలింగ్ బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

7 నుంచి పాఠశాలల్లో వార్షిక పరీక్షలు

రావికమతం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు ఈ నెల 7 నుంచి 17 వరకూ జరగనున్నట్టు ఎంఈవో తలుపులు తెలిపారు. మండలంలోని 71 పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 2,116 మంది విద్యార్థులు, 6 నుంచి 9 తరగతి వరకు 3,199 మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. వార్షిక పరీక్షలకు సంబంధించిన పరీక్ష పేపర్లను స్కూలు కాంప్లెక్సులకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పరీక్ష పేపర్లను నిర్ణీత సమయంలోగా తీసుకెళ్లాలని సూచించారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

బుచ్చెయ్యపేట: పొట్టిదొరపాలెం గ్రామంలో రామాలయం వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ రామాలయం నిర్మించి ఏడాదైన సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. రాత్రికి భజనలు, కీర్తనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

వార్షిక రుణ-జీవనోపాధిపై శిక్షణ తరగతులు

నాతవరం: కొత్తగా వచ్చిన నిబంధనలు ప్రకారం డ్వాక్రా గ్రూపు ఒక్కంటికి రూ.20లక్షలు వరకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయనున్నట్టు వెలుగు ఏపీఎం కనకరాజు తెలిపారు. మండల కేంద్రం నాతవరంలో శుక్రవారం వార్షిక రుణ-జీవనోపాధి ప్రణాళికలపై ఎన్యూమేటర్లు వీవోలకు మండల స్థాయి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 31 పంచాయతీల్లో మొత్తం 1,665 డ్వాక్రా సంఘాలు ఉన్నాయన్నారు. ఆయా సంఘాల్లో సభ్యులను ఆర్థికంగా అభివృద్ధి చేయడం కోసం శిక్షణ తరగతులు నిర్వహించడం ప్రధాన ధ్యేయమన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలు ప్రకారం డ్వాక్రా సంఘాలను క్షేత్ర స్థాయిలో సర్వే చేయడం కోసం మండల వ్యాప్తంగా 260 మంది ఎన్యూమేటర్లను కొత్తగా నియమించామన్నారు. ఎన్యూమేటర్లకు ఏడు నుంచి ఎనిమిది డ్వాక్రా సంఘాల చొప్పున కేటాయించామన్నారు. ఆయా సంఘాల సభ్యులను క్షేత్ర స్థాయిలో సర్వే చేసి ఈ నెల 15వ తేదీలోపు నివేదికను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఏవిధమైన రుణాలు ఇస్తే డ్వాక్రా సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతమవుతారనే అంశాలను వీటిలో ఉంటాయన్నారు. ఈ సర్వే చేసే ఎన్యూమేటర్లకు ప్రభుత్వం పారితోషికం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం కనకరాజు

కార్పొరేషన్ల రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు


దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేస్తున్న రోలుగుంట ఏపీజీవీబీ మేనేజర్ మహేష్


కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న బ్యాంకర్లు, ఎంపీడీవో సాంబశివరావు

రోలుగుంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీసీ కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. రుణాల మంజూరుకు ముందుకొచ్చిన రోలుగుంట, కొత్తకోట, నర్సీపట్నం ఏపీజీవీబీలు, కొత్తకోట ఎస్‌బీఐ, నర్సీపట్నం ఎస్‌బీఐ, ఏడీబీ, డీసీసీబీ బ్రాంచి మేనేజర్లు దరఖాస్తుదారులను ఇంటర్వ్యూ చేశారు. వారి ధ్రువపత్రాలను పరిశీలించారు. అన్ని అంశాలను పరిశీలించి రుణాలు మంజూరు చేస్తామని రోలుగుంట ఏపీజీవీబీ మేనేజర్ పి.మహేష్ తెలిపారు.

కె.కోటపాడు : బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే రుణాలకు బ్యాంకర్లు, ఎంపీడీవో సాంబశివరావు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కె.కోటపాడు, గోవాడ స్టేట్ బ్యాంక్ సిబ్బందితో పాటు చౌడువాడ, కె.కోటపాడు, ఆనందపురం ఏపీజీవీబీల సిబ్బంది, లంకవానిపాలెం ఇండియన్ బ్యాంక్ సిబ్బంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. మండలంలో 124 బీసీ కార్పొరేషన్ యూనిట్ల మంజూరుకు 647 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎస్.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.


మహిళల హక్కులపై అవగాహన అవసరం

నాతవరం: రాజ్యాంగంలో మహిళలకు కల్పించిన హక్కుల పట్ల కనీస అవగాహన అవసరమని నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ అన్నారు. మర్రిపాలెం పంచాయతీ శివారు వెన్నలపాలెంలోని జీడిపిక్కల పరిశ్రమలో పని చేస్తున్న మహిళలకు శుక్రవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ మోసాలపై మహిళలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ల ద్వారా అనేక ఆన్‌లైన్ మోసాలు జరుగుతున్నాయని, వాటికి ఆకర్షితులు కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. చదువుతోనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా షీ టీములు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు, జీడి పిక్కల ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు.


మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్న నర్సీపట్నం రూరల్ సిఐ ఎల్.రేవతమ్మ

రాజకీయ కక్షతో ఉపాధి మేట్ల తొలగింపు దారుణం

చీడికాడ: ఉపాధి హామీ పథకం మేట్లను ఏ నిబంధనలతో తొలగిస్తున్నారని ఎంపీపీ కురచా జయమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు ప్రశ్నించారు. పలు గ్రామాల్లో రాజకీయ దురుద్దేశంతో నిబంధనలకు విరుద్ధంగా మేట్లు తొలగించేందుకు ప్రయత్నించడంతో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట మంచాలకు చెందిన బాధిత మేట్లు, గ్రూపు కూలీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అప్పలరాజపుపురం, బి.సింగవరం, జేబీపురం, మంచాలతో పాటు పలు గ్రామాల్లో కూటమి నేతల ఒత్తిడితో కూలీలకు మాయమాటల చెప్పి వారితో సంతకాలు సేకరించి మేట్లు తొలగించేందుకు ఏపీవో ఎ.గంగునాయుడు ఇప్పటికే వీఆర్‌పీలకు ఆదేశాలిచ్చినట్లు తెలిసిందన్నారు. ఈ విధంగా ఇప్పటికే మంచాలలో ఇద్దరు మేట్లను తొలగించారన్నారు. దీనిపై ఎంపీడీవో హేమ సుందరరావు మాట్లాడుతూ ఇది నిబంధనలకు విరుద్ధమని, దీనిపై విచారణ చేపడతామన్నారు. అలాగే మండల ప్రత్యేకాధికారి మూర్తికి కూడా వినతిపత్రం అందించారు. ఈ ధర్నాలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు చుక్కా అప్పలనాయుడు, జి.చిన్నమ్మలు, శరగడం సన్యాసినాయుడు, బొడాల రమాదేవి, ఉప సర్పంచ్‌లు కసిరెడ్డి రామకృష్ణ, ఈర్లె చైతన్య పాల్గొన్నారు.


ఎంపీడీవో హేమ సుందరరావుకు వినతి పత్రం అందిస్తున్న మేట్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు